ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 263 సోమవారం 16-9-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## ఎమ్మెల్యే గాంధీ ఇంటి వద్ద
## భద్రత పెంపు

**హైదర్‌నగర్, సెప్టెంబరు 15:** ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఇంటి వద్ద ఆదివారం పోలీసులు



భద్రతను పెంచారు. ఎమ్మెల్యే గాంధీని పీఏసీ చైర్మన్‌గా నియమించినప్పటి నుంచి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, గాంధీ మధ్య మొదలైన మాటల యుద్ధం కాస్తా దాడుల వరకు వెళ్లింది. ఈ వివాదంపై కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేసుకుంటూ ఉండటంతో ఇంటెలిజెన్స్ హెచ్చరికల మేరకు ఆదివారం ఉదయం నుంచిగాంధీ ఇంటి వద్ద భద్రతను భారీగా పెంచారు. కూకట్‌పల్లి ఏసీపీ ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు ఇంటి చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రత కల్పించారు. మధ్యాహ్నం మరో 100 మంది పోలీసులను మోహరించడంతో ఏం జరుగుతుందోనని స్థానికంగా అలజడి నెలకొంది. సాయంత్రానికి పోలీసు భద్రత మళ్లీ 50 మందితోనే కొనసాగింది.

# స్థానిక సంస్థల ఎన్నికలు
# బీసీల లెక్క తేలాకే!

**- మహేశ్‌గౌడ్ టీపీసీసీ చీఫ్ కావడం సంతోషకరం - ఇద్దరం సమన్వయంతో పనిచేస్తాం: సీఎం రేవంత్**

**హైదరాబాద్, సెప్టెంబరు 15:** రాష్ట్రంలో బీసీ జనాభా లెక్కలు తేలాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బీసీ కమిషన్ ద్వారా రానున్న మూడు, నాలుగు నెలల్లో బీసీ జనాభా లెక్కలు తీస్తామని, ఆ వర్గాలకు దక్కాల్సిన వాటా ఇచ్చి.. ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితుడైన బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇందిరాభవన్ ఆవరణలో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బీసీ నేత అయిన మహేశ్‌కుమార్‌గౌడ్.. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం తామందరికీ సంతోషం కలిగిస్తోందన్నారు. 2023 ఎన్నికలు సెమీఫైనల్స్ మాత్రమేనని, 2029 పార్లమెంటు ఎన్నికలు ఫైనల్స్ అని సీఎం అభివర్ణించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెసను గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. ఎవరైనా తమ కార్యకర్తల జోలికివస్తే ఊరుకోబోమని, కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇక.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమైన కార్యకర్తలను సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, జడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు, మునిసిపల్ చైర్మన్లుగా గెలిపించుకునే బాధ్యత తనపైనా, మహేశ్‌కుమార్‌గౌడ్ పైనా ఉందన్నారు. ఈ విషయంలో తామిద్దరమూ సమన్వయం చేసుకుని ముందుకుపోతామని తెలిపారు. ఇప్పటిదాకా జరిగిన ఎన్నికలు నాయకులకు సంబంధించినవని, ఇకపై జరిగే ఎన్నికలు.. కాంగ్రెస్ జెండాలు మోసిన కార్యకర్తలకు సంబంధించినవని పేర్కొన్నారు. కార్యకర్తలను గెలిపించాల్సిన బాధ్యత తామందరిపైనా ఉందని, వారి గెలుపు కోసం తమ ఎన్నికల కంటే ఎక్కువగా కష్టపడతామని చెప్పారు.

**ఒక్కొక్కటిగా గ్యారెంటీల అమలు**

తాను 2021లో టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లానని, ఇంద్రవెల్లి వేదికగా సమరశంఖం పూరించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చామని రేవంత్‌రెడ్డి తెలిపారు. తానొకవైపు, భట్టి విక్రమార్క మరోవైపున పల్లె పల్లెనా పాదయాత్ర చేశామని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటప్రకారం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేశామన్నారు. రాష్ట్రంలోని 23 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేసి వ్యవసాయం పండుగ అని నిరూపించామన్నారు. తుక్కుగూడ సభలో సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని



చెప్పారు. పంద్రాగస్టు లోగా రూ.2 లక్షల మేరకు రైతు రుణమాఫీ చేస్తానని యాదగిరిగుట్ట నరసింహస్వామి సాక్షిగా ప్రకటించి.. ఇచ్చిన మాటప్రకారం భద్రాద్రి రాములవారి సాక్షిగా పంద్రాగస్టున అమలు చేశామని సీఎం రేవంత్ అన్నారు. "పంద్రాగస్టు కల్లా రూ.2 లక్షల రుణమాఫీ అమలైతే రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు సవాల్ చేశాడు.ఆ సన్నాసి ఇప్పుడు ఎక్కడ దాక్కున్నాడు?" అని ప్రశ్నించారు. రూ.2 లక్షల పైన రుణం ఉన్న రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రూ.2 లక్షల పైన ఉన్న రుణాన్ని బ్యాంకులో చెల్లించాలని, మరుక్షణమే ఆ రూ.2 లక్షలు ఆయా రైతుల ఖాతాలో వేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాబోయే పంట నుంచి సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని సీఎం ప్రకటించారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం.. అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలు ఇచ్చామన్నారు. మరో 35 వేల ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల చేశామని, ఈ ఏడాది చివరికల్లా ఆ ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమదని అన్నారు. నిరుద్యోగులకు నైపుణ్యం అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామని తెలిపారు. దేశంలో 140 కోట్ల మంది జనాభా, అందులో 50 శాతం యువత ఉన్నా.. ఒలింపిక్స్‌లో ఒక్క పతకం కూడా రాకపోవడం అవమానం కాదా? అని ప్రధాని మోదీని సీఎం ప్రశ్నించారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం దీక్ష పూనిందని, త్వరలో రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 2028 ఒలింపిక్స్‌లో దేశం తరపున బంగారు పతకాలు సాధించే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఇక రీజినల్ రింగ్ రోడ్డును తీసుకువచ్చి హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని, ముచ్చర్లలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను జోడెద్దుల్లా ముందుకు తీసుకెళ్లేందుకుగాను పూర్తి సమయాన్ని పార్టీకి కేటాయించే అధ్యక్షుడు ఉండాలని అధిష్ఠానాన్ని తాను కోరానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అధిష్ఠానం అన్నివిధాలా ఆలోచించి బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో తనదైన పాత్ర పోషించిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను అధ్యక్షుడిగా నియమించిందన్నారు. మొన్నటి ఎన్నికల్లో గెలుపు సెమీ ఫైనల్స్ మాత్రమేనని, ఫైనల్స్ 2029లో ఉంటాయని సీఎం చెప్పారు. ప్రధాని మోదీని ఓడించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేసినప్పుడే ఫైనల్స్‌లో కాంగ్రెస్ గెలిచినట్లని వ్యాఖ్యానించారు. వచ్చే పదేళ్లూ రాష్ట్రంలో కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని, 2029 పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో 15 సీట్లు గెలిస్తేనే ఫైనల్స్‌లో గెలిచినట్లవుతుందని పేర్కొన్నారు. అప్పటివరకూ ఎవరమూ విశ్రమించవద్దన్నారు.

## బీఆర్ఎస్ నేతల్లో ఇంకా
## అదే అహంకారం

**గాంధీ, కౌశిక్‌రెడ్డి గొడవ ఆ పార్టీ వ్యవహారం: పొన్నం**



**వర్గల్, సెప్టెంబరు 15:** ఎన్నికల్లో బీఆర్ఎసకు జనం బుద్ధి చెప్పినా ఆ పార్టీ నేతల్లో మార్పు కనిపిస్తలేదని.. ఇంకా అదే అహంకారాన్ని చూపుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ఎమ్మెల్యేలు గాంధీ, కౌశిక్‌రెడ్డి గొడవ బీఆర్ఎస్ అంతర్గత వ్యవహారమని, ఆ ఘర్షణతో కాంగ్రెసకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేల ఘర్షణపై బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తుందని ఆరోపించారు. అప్పట్లో కేసీఆర్ ప్రతిపక్ష పార్టీలు లేకుండా చేయాలనే కుట్రతో ఫిరాయింపులకు ఆజ్యం పోయగా.. ప్రస్తుతం ఆ పాపం వారికే చుట్టుకుందన్నారు. 'సీఎం రేవంత్‌రెడ్డి అద్భుత పథకాల అమలుతో ఆదరణ పొందుతుంటే వారు జీర్ణించుకోలేకపోతున్నారు. నిబంధనల ప్రకారం పీఏసీ చైర్మన్ పదవి గాంధీకి ఇచ్చాం. గతంలో మిత్రపక్షమైన ఎంఐఎంకు ఇచ్చిన విషయాన్ని వారు మర్చిపోయినట్లున్నారు' అని వ్యాఖ్యానించారు.

# జమిలి ఈ టర్మ్‌లోనే...

- ఒక దేశం-ఒకే ఎన్నికకు అన్ని పార్టీల మద్దతుపై మోదీ సర్కారు ఆశాభావం - ఎన్డీయే పక్షాల మధ్య సమన్వయం భేష్
- ఈ బంధం ఐదేళ్లూ కొనసాగుతుంది! - త్వరలోనే జనాభా లెక్కల సేకరణ
- కులగణనపై ఇంకా నిర్ణయించలేదు - కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** లోక్‌సభలో బీజేపీకి సొంతగా సంపూర్ణ మెజారిటీ లేనప్పటికీ జమిలి ఎన్నికలు నిర్వహించాలని గట్టి పట్టుదలగా ఉంది. 'ఒక దేశం-ఒకే ఎన్నిక'కు పార్టీలకతీతంగా మద్దతు లభిస్తుందని మోదీ సర్కారు ఆశాభావంతో ఉంది. మోదీ సారథ్యంలోని ప్రభుత్వం మూడోసారి అధికార పగ్గాలు చేపట్టి వంద రోజులు పూర్తవుతోందని.. పాలక కూటమిలో సమన్వయం అద్భుతంగా ఉందని.. ఈ బంధం ఐదేళ్లూ పటిష్ఠంగా కొనసాగుతుందని గట్టిగా భావిస్తోందని పేరు చెప్పడానికి ఇష్టపడని ప్రభుత్వ వర్గాలు ఆదివారం తెలిపాయి. 'జమిలి ఎన్నికలు ఈ టర్మ్‌లోనే అమలవుతాయి. వాస్తవ రూపం దాల్చబోతోంది' అని వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో జమిలి ఎన్నికల హామీ కూడా ఉంది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు సమాంతరంగా ఒకేసారి ఎన్నికలు జరపాలని.. ఇవి పూర్తయిన వంద రోజుల వ్యవధిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలంటూ.. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ ఇప్పటికే సిఫారసు చేసింది. జాతీయ లా కమిషన్ కూడా 2029 నుంచి లోక్‌సభ, అసెంబ్లీలు, పంచాయతీలు/మున్సిపాలిటీలకు ఒకే దఫా ఎన్నికలు జరపాలని.. ఒకవేళ త్రిశంకు సభ ఏర్పడితే లేదా అవిశ్వాస తీర్మానంలో ప్రభుత్వాలు ఓడిపోతే ఐక్య ప్రభుత్వాలు ఏర్పాటుచేయాలన్న నిబంధనతో విడిగా ఓ నివేదిక సమర్పించే అవకాశం ఉంది. తన సిఫారసుల అమలుకు ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేయాలని కోవింద్ కమిటీ ప్రతిపాదించింది. అలాగే జమిలి ఎన్నికలకు 18 రాజ్యాంగ సవరణలను సూచించింది. వీటిలో ఎక్కువ సవరణలకు రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం అక్కర్లేదని వివరించింది.

**'కులం' కాలమ్ ఉంటుందా?**

జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. అయితే కులాలవారీగా జనగణన చేపట్టడంపై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సదరు డాక్యుమెంటుపై 'కులం' కాలమ్ పెట్టాలా.. అక్కర్లేదా అన్న దానిపై నిర్ణయం తీసుకోవలసి ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు, కొన్ని ఎన్డీయే పార్టీలు కూడా కులగణన చేపట్టాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. జనాభా లెక్కలు వెల్లడైన తర్వాత చట్టసభల నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరుగుతుంది. ఇది పూర్తికాగానే లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు సీట్ల కేటాయింపు అమల్లోకి వస్తుంది. కాగా, ప్రభుత్వ ఎన్యూమరేటర్ల ద్వారా కాకుండా తమంత తాము జనగణన దరఖాస్తును నింపాలనుకునే పౌరులు ఎన్‌పీఆర్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా, రెండేళ్లలో దేశంలో నక్సలిజం పూర్తిగా కనుమరుగవుతుందని కేంద్ర వర్గాలు అంచనా వేస్తున్నాయి. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత మొదటి 100 రోజుల కార్యాచరణ జాబితాలోనే నక్సల్స్ సమస్యపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో భద్రతా బలగాల ఆపరేషన్లలో 150 మందికి పైగా మావోయిస్టులు హతమయ్యారు.

## డొనాల్డ్ ట్రంప్ సమీపంలో కాల్పులు

**మరోసారి హత్యాయత్నం?**



వాషింగ్టన్: అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. రిపబ్లిక్ పార్టీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమీపంలో కాల్పులు జరిగాయి. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో ఉన్న తన గోల్ఫ్ కోర్టులో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తుపాకీతో సంచరించాడు. దీంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అతనిపై కాల్పులు జరిపారు. వెంటనే ట్రంప్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్టు సమాచారం. అయితే కాల్పుల ఘటన అనంతరం ట్రంప్ సురక్షితంగానే ఉన్నారని, ప్రస్తుతానికి ఇంతకన్నా వివరాలేవీ లేవని ఆయన ప్రచార బృందం అధికార ప్రతినిధి స్టీవెన్ చెంగ్ తెలిపారు. ట్రంప్ క్షేమమేనని ఆయన భద్రత వ్యవహారాలు చూసే సీక్రెట్ సర్వీస్ విభాగం కూడా ధ్రువీకరించింది. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకునే కాల్పులు జరిగాయా అనే కోణంలో విచారణ చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు, అతని నుంచి ఏకే 47 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారని న్యూయార్క్ పోస్ట్ వార్తా సంస్థ వెల్లడించింది. కాగా, ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా కాల్పుల శబ్దాలు వినిపించాయని పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. అయితే కాల్పులకు పాల్పడింది ఒక్కరా లేదా ఇద్దరా అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదని, వారి ఉద్దేశం ఏంటనే విషయం తెలియదని వెల్లడించాయి. ఘటన గురించి అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు అధికారులు నివేదించారు. ఘటనలో ఎవరికీ గాయాలు అయినట్టు కూడా సమాచారం లేదని స్థానిక పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. గోల్ఫ్ ఆడుతుండగా ట్రంప్‌నకు సమీపంలోనే కాల్పులు జరిగాయని ఆయన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ అన్నారు. పొదల్లో ఏకే 47 రైఫిల్ కూడా లభించిందని చెప్పారు. ప్రస్తుతం ట్రంప్ క్షేమంగా ఉన్నారని చెప్పారు. అనుమానితుడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

### బఫర్ జోన్ వరద కాలువను ఆక్రమించుకొని రైతులను ఇబ్బందులు పెడుతున్న

# మాజీ సర్పంచ్ పట్టణశెట్టి నాగరాజు

### చర్యలు తీసుకుంటానన్న ఏ ఇ, డి ఇ లు నిర్లక్ష్యం చేస్తున్నారు






**సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 15 :** బఫర్ జోన్ వరద కాలువను ఆక్రమించుకొని మాజీ సర్పంచ్ పట్నం శెట్టి నాగరాజు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మునిగిల వీడు రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ ఏఈడీ లకు కంప్లైంట్ చేశారు.. ఫీల్డ్ మీదికి వెళ్లి విషయాన్ని గ్రహించిన ఏ ఈ.. పట్న శెట్టి నాగరాజు కాలువ మత్తడి దగ్గర బై ఫర్ జోన్ను ఆక్రమించుకోవడం వలన రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రత్యేక్షంగా గమనించారు,వెంటనే చర్యలు తీసుకుంటానని ఏఇ అన్నారు కానీ తీవ్రమైన జాప్యం చేస్తున్నందున రైతులు ఇబ్బందులు పడుతున్నారు... వివరాలు లోకి వెళితే... మునిగేలవేడు గ్రామంలోని గుండు కుంట కట్ట పరిధిలో డ్యామేజ్ జరిగింది. ఈ డ్యామేజీ కి కారణం. బ ఫర్ జోన్ వరద కాలువను అక్రమంగా మాజీ సర్పంచ్ పట్నం శెట్టి నాగరాజు ఆక్రమించుకున్నారు.. ఇలా ఆక్రమించడం వల్ల సహజ సిద్ధంగా వెళ్లిపోయే వరద పక్క రైతుల పంట పొలాలను నాశనం చేస్తోందని రైతులు వాపోతున్నారు. పక్కన ఉన్న రేగడి పొలంలోకి వరద రావడం వలన పంటకు నష్టం జరిగిందని ఓ రైతు వాపోతున్నారు.. మరొకసారి శనివారం పట్న శెట్టి నాగరాజు తన పొలంలో గండ్లు పడ్డాయనే సాకుతో రెండు ట్రాక్టర్ ట్రిప్పులు మట్టిని మత్తడి యొక్క స్టీమ్ పరిధిలో డంపు చేశారు.. పూడ్చు కోవడానికి మట్టిని తెచ్చిన మట్టి అక్కడే ఉండడం వలన రైతులకు ఇబ్బందిగా ఉన్నది అనేది రైతుల అభిప్రాయం, అదేవిదంగా. సర్పంచ్ పట్నం శెట్టి నాగరాజు నీటి సంఘం చైర్మన్ గా పనిచేశారు కనుక ఆ శాఖలో అధికారులతో పరిచయం ఉన్నందున వారిని అడ్డం పెట్టుకొని ఈ తప్పుడు పనులు చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు,కనుక ఉద్దేశ్య పూర్వకంగా రైతుల పంటలకు ఇబ్బందులు కలుగ జేస్తున్నా మాజీ సర్పంచ్ పై చర్యలు తీసుకొని బై ఫర్ జోన్ సమస్యను అధికారులు పరిష్కరించాలని రైతులు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు సోమయ్య నాగేష్ రమేష్ రామయ్య యాదగిరి డి కృష్ణ ఈ రమేష్ బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభం చేశారు..సరే..విధులను

# నిర్వహించే డాక్టర్ ఎవరు..?




### - గర్భిణీలకు నార్మల్ డెలివరీ చేసేదేవరు?

### - నిరుపయోగంగా డాక్టర్ రెసిడెన్షియల్ క్వార్టర్

**తొలి సమయం, ప్రతినిధి జయశంకర్ భూపాలపల్లి సెప్టెంబర్15 :** మొగుళ్లపల్లి ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తేవాలనే సదుద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో డాక్టర్ రెసిడెన్షియల్ క్వార్టర్ ను రూ. 19.50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించి..మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.సరే..ఆ డాక్టర్ రెసిడెన్షియల్ క్వార్టర్ లో ప్రజలకు అందుబాటులో ఉండి.. వైద్య సేవలను అందించే డాక్టర్ ను ఎవరిని నియమించారో ప్రజలకు అర్థం కావడం లేదు. రాత్రి వేళల్లో పాముకాటుకు గానీ..తేలుకాటుకు గానీ..కుక్కలు, కోతులు కరిచినప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో వారు వ్యయ, ప్రయాసలకు ఓర్చుకొని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. రెసిడెన్షియల్ క్వార్టర్ ప్రారంభించి సంవత్సరం కావస్తున్న నిరుపయోగంగా ఉండడంతో ప్రభుత్వ సొమ్ముతో అనవసరంగా ఎందుకు నిర్మించారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా వారానికి ఒకసారి గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు చేసి..ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నార్మల్ డెలివరీ చేయాలని ఉన్నత అధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని బేకతర్ చేస్తూ ఒక్క డెలివరీ కూడా చేయకపోవడం గమనార్హం. వైద్యాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇక్కడ పేద ప్రజలకు అందని ద్రాక్షగా వైద్యం మారుతుంది. దీంతో ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుంది. భూపాలపల్లి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి ప్రతి రివ్యూ మీటింగ్ లలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వైద్య శాఖపై పూర్తిగా దృష్టి సారించి ఎప్పటికప్పుడు పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందాలని , వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించినప్పటికీ, వారి తీరు మారకపోవడం గమనార్హం, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ , సంబంధిత వైద్యశాఖ అధికారులు స్పందించి..నిరుపయోగంగా ఉన్న డాక్టర్ రెసిడెన్షియల్ క్వార్టర్ లో డాక్టర్ ఉండే ప్రజలకు వైద్య సేవల తో పాటు గర్భిణీ స్త్రీలకు నార్మల్ డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలు కోరుతున్నారు.

### డాక్టర్ రెసిడెన్షియల్ క్వాటర్ నిరుపయోగంగా ఉంది

**- వెంటనే డాక్టర్ ను నియమించి..ప్రజలకు 24 గంటల వైద్యాన్ని అందించాలి**

**- మాజీ సర్పంచ్ మేదరమేట్ల, మొగుళ్ళపల్లి మండలం కొనుకటి అరవింద్ రెడ్డి**



రూ.19.50 లక్షల వ్యయంతో నిర్మించి..ప్రారంభోత్సవం చేసిన డాక్టర్ రెసిడెన్షియల్ క్వాటర్ నిరుపయోగంగా ఉంది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి, పేద ప్రజలకు 24 గంటల వైద్యం అందించే విధంగా డాక్టర్ ను నియమించి. నిరంతర వైద్య సేవలను అందించాలని సంబంధిత అధికారులను కోరుతున్నాను.

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పందించాలి

**బీజేవైఎం మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు బత్తిని శ్రీధర్ గౌడ్**



మొగుళ్ళపల్లిలో నిర్మించిన డాక్టర్ రెసిడెన్షియల్ క్వాటర్ లో వెంటనే డాక్టర్ ను నియమించి..అందులో 24 గంటల వైద్యాన్ని ప్రజలకు అందించేందుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కృషి చేయాలని, డాక్టర్లు సరిగా అందుబాటులో లేని కారణంగా పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన జన్నె సాయి శ్రీ అనే ఏడేళ్ల బాలిక మృతి చెందింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పందించాలి.

## కులగణనను పక్కదారి పట్టిస్తున్నారు

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్**

**నార్కట్‌పల్లి, సెప్టెంబరు 15:** రాష్ట్రంలో కులగణనను నిర్వహించి బీసీల రిజర్వేషన్‌ను పెంచకుండా ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది పక్కదారి పట్టిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్ ఆరోపించారు. ఆదివారం నల్లగొం డ జిల్లా నార్కట్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయస్థాయిలో బీసీల రిజర్వేషన్ కోసం కులగణన అవసరమని రాహుల్‌గాంధీ చెబుతుంటే ఇక్కడి సీఎం మాత్రం రాహుల్ మాట వినడం లేదని విమర్శించారు. బీసీల రిజర్వేషన్ పెంపునకు బీసీల జనాభాను నిర్ధారించే కులగణనే ప్రామాణికమని హైకోర్టు స్పష్టంగా తీర్పునిచ్చిందన్నారు. ప్రభుత్వం కూడా కులగణనకు తాము సిద్ధమేనని ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ ద్వారా కోర్టుకు చెప్పిన విషయాన్ని జాజుల గుర్తుచేశారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తూ కులగణన కోసం షెడ్యూల్, రూట్‌మ్యాప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.




**- దశాబ్దాలు గడుస్తున్న మారని బతుకులు**

**- బిల్లులు రాక ఇక్కట్లు**

**- వృద్ధ కార్మికులకే చేనేత పరిమితం**

**కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 15:** జిల్లాలో ఎక్కువ శాతం ఉన్న చేనేత కార్మికులకు ఉన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా వీరి బతుకులు మాత్రం మారడం లేదు. కులవృత్తిని నమ్ముకున్న కుటుంబాలు ఇతర వృత్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. తాము బతకడంతోపాటు మరికొంత మందికి ఉపాధి కల్పించాల్సిన చేనేత కార్మికులు బతుకుదెరువు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో ఇతర వృత్తివ్యాపారాల్లోకి వెళ్లిపోతున్నారు. కాగజ్‌నగర్ సొసైటీలో గతంలో 60మంది పనిచేసేవారు. ప్రస్తుతం వయోభారంతోపాటు ఇతర కారణాలతో వారిలో కొంతమంది వేరేవృత్తిలోకి వెళ్లగా కేవలం 30మందితోనే ప్రస్తుతం సొసైటీని నడిపిస్తున్నారు. ఈ సొసైటీ ద్వారా చేనేత కార్మికులకు పని కల్పించి వారు తయారు చేసిన బెడ్ షీట్స్, కార్పెట్స్‌ను ప్రభుత్వం ఆధ్వర్యంలోని హాస్టళ్లకు సప్లయ్ చేస్తారు. వాటిపై వచ్చే బిల్లులను త్వరగా మంజూరు చేయక రోజు వారి కూలీగా వచ్చే రూ. 250నుంచి 450కూడా రాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**సర్‌సిల్క్‌మిల్లు మూసివేతతో..**

35సంవత్సరాల క్రితం సర్‌సిల్క్(వస్త్ర పరిశ్రమ) మూతపడడంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కాగజ్‌నగర్‌లోని ఈ మిల్లులో వేలాది మంది పని చేస్తుండేవారు. వారంతా తదనంతర కాలంలో మహారాష్ట్రలోని షోలాపూర్, బీవండి, హైదరాబాద్, సూరత్ తదితర పట్టణాలకు వెళ్లి జీవనోపాధి కొనసాగిస్తున్నారు. అయితే స్థానికంగా ఉన్న కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం కాగజ్‌నగర్ చేనేత సహకార సంఘం ఉత్పత్తులు, విక్రయ సంఘాన్ని 2002లో భవనం మంజూరు చేసి నిర్మించింది. ఈ సొసైటీ ద్వారా పలువురు మహిళా కార్మికులు ఉపాధి పొందుతున్నారు. మిల్లు మూసివేసినప్పటి నుంచి కేవలం నామమత్రంగా బతుకులు వెళ్లతీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చేనేత కార్మికులకు చేయూతను అందించే దిశగా ప్రవేశపెట్టిన పథకాలు మధ్యలో నిలిచిపోవడంతో పూట గడవని పరిస్థితి ఉంది.

**నిలిచిన చేనేత మిత్ర**

చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే చేనేత మిత్ర పథకం కొంతకాలంగా నిలిచిపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. చేనేత కార్మికులకు రూ.2000, అనుబంధ కార్మికుడికి నెలకు రూ.500 చేనేత చేయూత (థ్రిఫ్ట్ పథకం) కింద ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ పథకం నిలిచిపోయిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల కిందట చేనేత సొసైటీని సందర్శించిన సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు చేనేతల సంక్షేమానికి తగిన నిధులు ఇప్పిస్తామని హామీ ఇచ్చినట్లు కార్మికులు పేర్కొన్నారు. అలాగే చేసిన పనికి వచ్చే మొత్తం కూలీకి రెట్టింపుగా వచ్చే రికరింగ్ డిపాజిట్ పథకం కూడా పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు. దీంతోపాటు వ్యక్తిగత రుణాలు మాఫీ చేసి, ముద్ర రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులు నేసిన వస్త్రాలకు నిలిపి వేసిన బిల్లులు మంజూరు చేస్తే అటు ఉపాధితో పాటు మరోవైపు వడ్డీ భారం తగ్గినట్లు అవుతుందని పేర్కొంటున్నారు.

### మహిళపై అత్యాచారం... రేపిస్టును ఎన్‌కౌంటర్ చేయాలంటూ డిమాండ్

ములుగు: దేశంలో ఏ మూలన చూసినా ప్రతిరోజూ మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్ని కఠిన శిక్షలు వేస్తున్నా నేరస్థుల్లో మాత్రం భయం పుట్టడం లేదు. ఒక ప్రాంతంలో అత్యాచారం జరిగిందంటూ పెద్దఎత్తున నిరసనలు జరిగిన మరుసటి రోజే మరో అత్యాచారం గురించి వినాల్సిన దుస్థితి నెలకొంది. కామాంధులకు కఠిన శిక్షలు పడుతున్నా చివరికి ఎన్‌కౌంటర్లు జరిగిన ఘటనలు కళ్లెదుటే కనిపిస్తున్నా నిందితుల్లో మాత్రం మార్పు కనిపించడం లేదు. తాజాగా అలాంటి ఘటనే ఒకటి ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ఓ గ్రామంలో వరస అత్యాచారాలు చేస్తూ హడలెత్తిస్తున్న కామాంధుడు శివకుమార్.. గత రాత్రీ(శనివారం) మరో మహిళపై దారుణానికి ఒడిగట్టాడు. వృద్ధురాలని కూడా చూడకుండా ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెపై కన్నేశాడు. ఎవరూ లేని సమయం చూసి ఇంట్లో చొరబడి అత్యాచారం చేశాడు. గదిలోనే బంధించి రాత్రి మొత్తం అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఉదయం ఘటన గురించి తెలుసుకున్న గ్రామస్థులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. గ్రామస్థులంతా వెంకటాపూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. నిందితుడు శివకుమార్‌ను కఠినంగా శిక్షించాలని స్టేషన్ ఎదుట బైఠాయించి డిమాండ్ చేశారు. శివకుమార్ గతంలోనూ ఆరుగురు మహిళలపై అత్యాచారం చేశాడని గ్రామస్థులు ఆరోపించారు. ఇలాంటి కామాంధుణ్ని వదలకూడదని, వదిలితే మరిన్ని దారుణాలకు పాల్పడతాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతణ్ని ఎన్‌కౌంటర్ చేయాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి డిమాండ్ చేస్తున్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101